

చీనీ టన్ను రూ.14 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.14 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.47

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.47, కనిష్టంగా రూ.30 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
36.2°/21.4°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు

- 31 మండలాల్లో 29.6 మి.మీ సగటు వర్షపాతం నమోదు



పెడపల్లి వద్ద సప్లై ఛానల్‌లో పారుతున్న నీరు

పుట్టపర్తి అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ తలుపుల తప్ప మిగతా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. 31 మండలాల పరిధిలో 29.6 మి.మీ సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా గాండ్లపెంట మండలంలో 71.2 మి.మీ, సోమందేపల్లి మండలంలో 56.4 మి.మీ, పుట్టపర్తి మండలంలో 55.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక అగళి మండలంలో 48.6 మి.మీ, పెనుకొండ 48.2, గోరంట్ల 45.2, కదిరి 38.8, మడకశిర 38.8, నల్లచెరువు 38.2, రామగిరి 36.6, బుక్కపట్నం 36.2, సీకేపల్లి 33.6, పరిగి 30.6, లేపాక్షి 30.4, అమరాపురం 29.4, రొళ్ల 29.4, నల్లమాడ 29, తాడిమర్రి 26, హిందూపురం 25.8, రొద్దం 21.6, తనకల్లు 20.8, ధర్మవరం 19.4, చిలమత్తూరు 16.8, గుడిబండ 11.2, కనగానపల్లి 8.2, అమడగూరు 6.6, ఓడీచెరువు 4.2, బత్తలపల్లి 3.4, ఎన్‌పీకుంట మండలంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది. తాజా వర్షాలతో అక్కడక్కడా జలకళ సంతరించుకుంది. పెడపల్లి వద్ద కాలువకు వర్షపు నీరు చేరాయి.

మరో ఐదు రోజులు వర్షాలు

అనంతపురం అగ్రికల్చర్: రాగల ఐదు రోజులూ ఉమ్మడి జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 25 మి.మీ, 7న 15.4, 8న 20, 9న 25, 10న 11.5 మి.మీ సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 31.2 – 35 డిగ్రీల మధ్య నమోదవుతాయన్నారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి



మృతి చెందిన రత్నమ్మ

మడకశిర రూరల్: పిడుగుపాటుకు ఓ మహిళా గొర్రెల కాపరి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని ఉప్పార్లపల్లి గ్రామానికి చెందిన రత్నమ్మ(45)తో పాటు ముగ్గురు గొర్రెల కాపరులు జీవాలను మేపుకునేందుకు క్యాంపురం గ్రామ సమీపంలోకి వెళ్లారు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఈ వెంటనే పిడుగులు పడ్డాయి. ఆ సమయంలో పొలంలో గొర్రెలకు మేత వేస్తున్న రత్నమ్మ సమీపంలోనే ఓ పిడుగు పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. జీవాలపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్న రత్నమ్మ మృతితో ఆ కుటుంబం అండను కోల్పోయింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం స్పందించి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఉద్యాన రైతుకు శరగోపం


ఆరుగాలం శ్రమించి దేశానికే అన్నం పెట్టే రైతుకు కూటమి సర్కార్ సున్నం పెడుతోంది. అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్టపోతే గతంలో పరిహారం అందించే ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడింది. రైతులే ప్రీమియం చెల్లించినా నేటికీ పరిహారం అందించలేదు. కనీసం బీమా కంపెనీలతో కూడా మాట్లాడేంత సమయంలేని పాలకులపై రైతులు శాపనార్థాలు పెడుతున్నారు.

కూటమి 'బీమా'య


- ఉద్యాన రైతును నిండా ముంచిన సర్కార్
- ఉచిత పంటల బీమాకు మంగళం
- రైతులే ప్రీమియం చెల్లించినా నేటికీ అందని పరిహారం
- సొమ్ము కోసం ఎదురు చూస్తున్న 10 వేల మంది రైతులు
- వైఎస్ జగన్ హయాంలో రైతు పైసా కట్టకపోయినా బీమా అమలు



మామిడి తోటలు



పుట్టపర్తి: ఏటా అతివృష్టి..లేదా అనావృష్టి...జిల్లా రైతుల రెక్కల కష్టం నిష్ఫలమైపోతోంది. పెట్టుబడులు కూడా చేతికందక అప్పులు మిగులుతున్నాయి. అందుకే గత వైఎస్ జగన్ సర్కార్ రైతు వేసే ప్రతి అడుగులోనూ తోడుగా నిలిచింది. తక్కువ నీటితోనే ఉద్యాన పంటలను ప్రోత్సహించింది. అంతేకాకుండా పంట పండితే గిట్టుబాటు ధర కల్పించింది.. పంట ఎండితే ఉచిత పంటల బీమా అమలు చేసి పరిహారం ఇచ్చి ఆర్థికంగా అండగా నిలిచింది. అందుకే గతంలో రైతులు ఆనందంగా పంటలు సాగుచేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఉచిత బీమా కింది జిల్లాలో 11 వేల మంది ఉద్యాన రైతులకు రూ.350 కోట్ల వరకు పరిహారం అందింది. కానీ కూటమి సర్కార్ రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. ఉద్యాన రైతులే ప్రీమియం చెల్లించినా.. నేటికీ పరిహారం ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. ఈ ఏడాది జిల్లాలోని రైతులు మామిడి పంటకు పెద్ద మొత్తంలో



చీనీ తోట

బీమా ప్రీమియం చెల్లించారు. సీజన్ ముగిసినా.. బీమా సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కాలేదు.

ధీమా ఇవ్వని బీమా

కూటమి ప్రభుత్వం పంటల బీమా పేరుతో ఎకరా మామిడికి రూ.1,800 చొప్పున ప్రీమియం కట్టించుకుంది. జిల్లాలో మామిడి 50 వేల ఎకరాల్లో సాగులో ఉండగా...2,500 మంది రైతులు 5 వేల ఎకరాలకుపైగా సాగు చేసిన మామిడి పంటలకు బీమా కోసం సుమారు రూ.కోటి వరకూ ప్రీమియం చెల్లించారు. ఈసారి మామిడి పూర్తిగా దెబ్బతినగా రైతులకు రూ.500 కోట్లు నష్టం వాటిల్లింది. ఎకరాకు కనీసంగా రూ.25 వేల చొప్పున పరిహారం ఇచ్చినా బీమా చేసిన రైతులకు రూ.12.50 కోట్లకుపైగా రైతులకు అందాల్సి ఉంది. కానీ నేటికీ పైసా అందలేదు. కనీసం కూటమి సర్కార్ నేటికీ ఎంత మేర పంటనష్టం జరిగిందో కూడా బీమా కంపెనీలకు పంపలేదని తెలుస్తోంది. ఇదికాకుండా జగన్ సర్కార్ ఏటా చీనీ రైతులకు ఉచిత పంటల బీమా కింద ఎకరాకు రూ.20 వేలు ఇవ్వగా... కూటమి సర్కార్ మూడు సీజన్లు దాటినా నయాపైసా ఇవ్వలేదు. ఇదికాకుండా మరో 7,500 మంది రైతులు పంట నష్ట పరిహారం కోసం ఏడాదిన్నర నుంచి ఎదురు చూస్తున్నారు.

పరిహారం ప్రకటించాల్సి ఉంది



జిల్లాలో ఉద్యాన పంటలకు సంబంధించి ప్రీమియం కట్టిన రైతులకు పరిహారం ఎంత అన్నది ప్రకటించాల్సి ఉంది. వాతావరణ బీమా కాబట్టి వర్షపులెక్కల మేరకు బీమా కంపెనీలు పరిహారం లెక్కగట్టాల్సి ఉంది. ఆ ప్రక్రియ పూర్తయితే పరిహారం ఎంతన్నది తెలుతుంది. ఆ తర్వాత పరిహారం మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేస్తాం. **– చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి**

బీమా రాలేదు



నేను మామిడి, చీనీ పంటలు సాగు చేశా. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచిత పంటల బీమా కింద చీనీ పంటకు క్రమం తప్పకుండా నాలుగేళ్లు ఎకరాకు రూ.20 వేల చొప్పున జమ చేసింది. ఈ సీజన్‌లో మామిడి పంటకు ఎకరాకు రూ.1,800 ప్రీమియం కట్టినా.. ఇప్పటి వరకు బీమా సొమ్ము జమకాలేదు. జమ అవుతోందో కాదో కూడా తెలియడం లేదు.

–ఆవుటాల ఓబిరెడ్డి, బుచ్చయ్య గారిపల్లి, బుక్కపట్నం మండలం

ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి సర్కార్ కొనసాగించాలి. ప్రీమియం చెల్లించాల్సి వచ్చినా ప్రభుత్వం కట్టాలి. రెండేళ్లుగా మామిడి, చీనీ పంటలు పండక, పండినా గిట్టు బాటు ధర లేక నాలాంటి సన్నకారు రైతులు పెద్ద ఎత్తున నష్ట పోయారు. పెట్టుబడి కూడా చేతికందలేదు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు కనీసం రూ.40 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. **– లోసారి వెంకట్రాముడు, కడపనాగేపల్లి, బుక్కపట్నం మండలం**

పెట్టుబడి దక్కలేదు



ఈ ఏడాది వాతావరణ మార్పులతో మామిడి దిగుబడి గణనీయంగా తగ్గింది. అరకొరగా పండిన పంటకూ గిట్టుబాటు ధర లేక పెద్ద ఎత్తున నష్టపోయాం. దీంతో పెట్టుబడులు కూడా రాక రైతులంతా అప్పుల పాలయ్యారు. కూటమి సర్కార్ మానవతా దృక్పథంతో మామిడి రైతులను ఆదుకోవాలి. జగన్ హయాంలో మాదిరి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి. **– గంగురులప్ప, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం**

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- టీడీపీ ఎమ్మెల్యే నసీర్ రాజీనామా చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ డిమాండ్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉషశ్రీ చరణ్, నాయకులు

సోమందేపల్లి : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మహిళలతో వీడియో కాల్‌లో ప్రవర్తించిన తీరును నిరసిస్తూ మంగళవారం సోమందేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ... టీడీపీ ఎమ్మెల్యే నసీర్ ప్రవర్తించిన తీరును సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఓ మహిళ హోం మంత్రిగా ఉన్న రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకపోవడం దురాగ్మమన్నారు. సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కూడా ఓ మహిళ పట్ల గతంలో వ్యవహరించిన తీరు నిజంగా దారుణంగా ఉందన్నారు. ఇక హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచరుడు ఇటీవల ఓ మహిళను లైంగికంగా వేధించడం... రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలోని ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం ఘటనలు రాష్ట్రంలో మహిళ రక్షణను ప్రశ్నార్థకం చేశాయన్నారు. రాష్ట్రంలో మహిళలపై రోజూ ఏదో ఒక చోట అఘాయిత్యాలు జరుగుతున్నా.. కూటమిలో భాగస్వామ్యంగా ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మహిళల రక్షణ కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'దిశ' యాప్‌ను తీసుకువస్తే... కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఇప్పటికైనా కూటమి సర్కార్ మహిళల రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఎమ్మెల్యే నసీర్‌తో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్లు వెంకటరత్నం, నారాయణరెడ్డి, సర్పంచ్‌లు రామాంజి, కిష్టప్ప, పరంధామ, వైస్ సర్పంచ్ వేణు, నాయకులు లక్ష్మీ నరసప్ప, మంజు, నాగమణి, ఆదినారాయణరెడ్డి, నరసింహ మూర్తి, ఈశ్వర్, నాగప్ప, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్, చిత్రంలో జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: స్వాతంత్య్ర దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న స్థానిక పోలీస్ పేరేడ్ మైదానంలో చేయాల్సిన ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ చేతన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌ను అందంగా ముస్తాబు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై స్టాళ్లు, శకటాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ శాఖల్లోని అధికారులు, ఉద్యోగులను అవార్డులకు ఎంపిక చేసి జాబితాను పంపించాలన్నారు. సమావేశంలో జేసీ అభిషేక్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొత్తచీర కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థిని ఉషారాణి(ఫైల్)

ధర్మవరం అర్బన్: కళాశాలలో జరిగే ఓ కార్యక్రమానికి కొత్త చీర కొనివ్వలేదని మనస్థాపం చెందిన ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మంగళవారం ధర్మవరం పట్టణంలో జరిగింది. టూ టౌన్ సీఐ రెడ్డప్ప, విద్యార్థిని తల్లి గట్టు భాగ్యలక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని బాలాజీనగర్‌లో నివసిస్తున్న గట్టు భాగ్యలక్ష్మి, గట్టు శ్రీరాములుకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. పెద్ద కుమార్తె గౌతమి ధర్మవరం రైల్వేస్టేషన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తోంది. చిన్న కూతురు గట్టు ఉషారాణి(16) స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మగ్గంపై ఆధారపడి జీవించే గట్టు శ్రీరాములు కుటుంబ పోషణకు ఇప్పటికే అప్పులు చేశాడు. పైగా ఇప్పుడు పని కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో కళాశాలలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు తనకు కొత్త చీర కొనివ్వాలని చిన్న కూతురు ఉషారాణి సోమవారం రాత్రి తల్లి భాగ్యలక్ష్మిని అడిగింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి చూసి కూడా కొత్త చీర ఎలా అడుగుతావంటూ తల్లి ఆమెను మందలించింది. దీంతో ఉషారాణి ఏడ్చుకుంటూ వెళ్లి పడుకుంది. మంగళవారం ఉదయం శ్రీరాములు బయటకు వెళ్లగా.. తల్లి భాగ్యలక్ష్మి పెద్దకూతురు గౌతమిని రైల్వేస్టేషన్‌లో వదిలిపెట్టేందుకు వెళ్లింది. తిరిగి వచ్చి చూసే సరికి చిన్నకూతురు తలుపులు వేసుకుని లోపల ఉండిపోయింది. ఎంత పిలిచినా పలకక పోవడంతో చుట్టుపక్కలవారిని పిలిచి తలుపులు పగలకొట్టించింది. లోపలకు వెళ్లి చూడగా.. వంట గదిలో ఇనుప తీరుకు ఉషారాణి చీరతో ఉరివేసుకుని నిర్జీవంగా కనిపించింది. వెంటనే ఉషారాణిని కిందకు దించి అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా... పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రుల ఇలాకాల్లోనూ రేషన్ దందా

- **జూలై 23న** చెన్నేకొత్తపల్లి మండలం ఎర్రంపల్లి బస్టాప్ వద్ద ఆటోల్లో తెచ్చిన రేషన్ బియ్యాన్ని లారీల్లోకి మార్చే దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. వాటాల్లో తేడా రావడంతో ముఠాలోని సభ్యులే వీడియోను పోలీసులతో పాటు పలువురికి వాట్సాప్ ద్వారా పంపించారు. అయితే పోలీసులు అక్కడికి వెళ్లే సరికి వాహనాలు లేవు. కానీ నంబర్ల ఆధారంగా ఇప్పటికీ ఆ వాహనాలను గుర్తించలేదు. జిల్లాకు చెందిన ఓ మంత్రి అనుచరుడి కనుసన్నల్లో జరిగే దందా కావడంతో పట్టించుకోలేదని సమాచారం.
- **మే 8వ తేదీన** ధర్మవరం నుంచి బెంగళూరు తరలిస్తున్న 4 టన్నుల రేషన్ బియ్యాన్ని సోమందేపల్లి జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకున్నారు. ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి బియ్యం స్వాధీనం చేసుకుని పౌర సరఫరా శాఖ అధికారులకు అప్పజెప్పారు.
- **జూన్ 9వ తేదీన** బత్తలపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన 750 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పలువురి నుంచి కిలో రూ.18 చొప్పున కొనుగోలు చేసిన ఓ వ్యక్తి నిల్వ చేయగా.. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు.

- పెనుకొండ, ధర్మవరం కేంద్రాలుగా రేషన్‌బియ్యం అక్రమ రవాణా
- రాత్రివేళ ఆటోలు, ఐచర్ వాహనాల్లో తరలింపు
- రేషన్ బియ్యం మాఫియా వెనుక కూటమి నేతలు!
- పేదల బియ్యం సరిహద్దు దాటిపోతున్నా పట్టించుకోని పోలీసులు



జూలై 23న ఎర్రంపల్లి బస్టాప్ వద్ద రాత్రి వేళ ఆటోల్లో తీసుకువచ్చిన రేషన్ బియ్యం



మే 8న సోమందేపల్లి వద్ద స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం



జూన్ 9న బత్తలపల్లిలో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రేషన్ బియ్యం దందా జిల్లాలో జోరుగా సాగుతోంది. కొందరు నాయకులు మాఫియాగా ఏర్పడి.. రేషన్ బియ్యం దందా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. తక్కువ ధరకు పేదల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రం కర్ణాటక తరలిస్తూ.. అక్కడ ఎక్కువ ధరలకు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. మంత్రులు సవిత, సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పెనుకొండ, ధర్మవరం నియోజకవర్గాల్లో రేషన్ బియ్యం దందా మరింత ఎక్కువగా సాగుతోంది.

సిండికేట్‌గా మారి..

రేషన్ బియ్యం రూ.కోట్లు కురిపిస్తుండటంతో కూటమి ముఖ్య నేతల అనుచరులు ఇద్దరు సిండికేట్‌గా మారారు. రేషన్ దందాలోకి ఎవరూ రాకుండా చక్రం తిప్పుతున్నారు. సోమందేపల్లికి చెందిన ఓ వ్యక్తి.. ధర్మవరం చుట్టుపక్కల కొనుగోలు చేసి రాత్రి వేళల్లో ఎస్ఎస్ గేటు, పెనుకొండ, కొడికొండ మీదుగా కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ మంత్రి అండదండలు ఉండటంతో పోలీసులు కూడా వాహనాలను పట్టుకోలేని పరిస్థితి. మరో వ్యక్తి కూడా ధర్మవరం సమీప ప్రాంతాల్లో రేషన్ బియ్యం సేకరించి కర్ణాటక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. మరికొందరు రేషన్ దందాలో తలదూర్చినా..సదరు ముఠా సభ్యులకు కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కమీషన్లు ఇవ్వకుంటే.. మార్గంలో సరుకును పోలీసులకు అప్పజెబుతామని బెదిరింపులకు కూడా దిగుతున్నారని సమాచారం. వారి ద్దరి ఆధ్వర్యంలోనే రోజూ లారీ రేషన్ బియ్యం హద్దు దాటిపోతున్నట్లు తెలిసింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని ఒక చోట నిల్వ ఉంచి.. పెనుకొండ, సోమందేపల్లి, రామగిరి మీదుగా కర్ణాటక తరలిస్తున్నారు. జిల్లాలోని 16 మండలాలకు కర్ణాటక సరిహద్దు ఉండటంతో రేషన్ బియ్యాన్ని సరిహద్దు దాటించడం సులువుగా మారింది. ఈ దందాలో ప్రతి నెలా రూ.3 కోట్ల వరకు చేతులు మారుతున్నట్లు సమాచారం. ఇందులో ఎవరి వాటా వారికి వెళ్లినా.. ఒక్కో వ్యక్తికి సగటున రూ.5 లక్షల వరకు మిగులుతున్నట్లు తెలిసింది.

పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడే దాడులు

ధర్మవరం, నల్లమాడ, కొత్తచెరువు ప్రాంతాల నుంచి వచ్చే రేషన్ బియ్యం పెనుకొండ, సోమందేపల్లి మీదుగా కర్ణాటక వెళ్తున్నట్లు సమాచారం. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు మాత్రం పోలీసులు అడపాదడపా అక్కడక్కడా రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుంటారు. ఆ తర్వాత మళ్లీ 'మామూలు'గా వ్యవహారం సాగుతోంది.

రీసైక్లింగ్ చేసి అధిక ధరలకు..

రేషన్ బియ్యం ముఠాకు కొందరు రేషన్ షాపు డీలర్లే లోపాయికారీగా సహకరిస్తున్నట్లు సమాచారం. అనంతరం రేషన్ బియ్యం కర్ణాటకలోని మిల్లుల్లో సన్నబియ్యంగా మారి మన మార్కెట్‌లోకి వస్తున్నాయి. రేషన్ దందా ఇంత పెద్ద ఎత్తున సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు ఉన్నాయి. కూటమి నేతలే అక్రమ వ్యాపారులుగా అవతారమెత్తి.. బియ్యం దందాను నడిపిస్తున్నారు. పేదలకు వచ్చే రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ.. కర్ణాటకలో అధిక ధరలకు విక్రయించి భారీగా లాభాలు ఆర్జిస్తున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో రేషన్ షాపుల నుంచి నేరుగా నల్లబజారుకు చౌక బియ్యం తరలిపోతున్నట్లు తెలిసింది.

2025లో ఇప్పటి వరకు కేసులు	23
అధికారులు స్వాధీనం చేసుకున్నది	2.41 టన్నులు
ప్రతి నెలా అక్రమంగా సరిహద్దు దాటుతున్న బియ్యం	3 వేల టన్నుల వరకు
ప్రజల నుంచి కొంటున్న ధర కిలోకు	రూ.17 నుంచి రూ.20 వరకు

గీత దాటితే వేటు తప్పదు



రేషన్ బియ్యం దందా ఎవరు చేసినా వదిలిపెట్టేది లేదు. రేషన్ డీలర్లు గీత దాటితే వేటు తప్పదు. రేషన్ బియ్యంతో అక్రమ వ్యాపారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలే ప్రసక్తే లేదు. ఎక్కడైనా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నా.. నిల్వ చేసినా.. సమాచారం చెబితే.. దాడులు చేసి కేసులు నమోదు చేస్తాం.

– వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి

క్లుప్తంగా

మొన్న పెళ్లి.. నిన్న ఆత్మహత్య


హర్షిత (ఫైల్)

సోమందేపల్లి : మండల కేంద్రంలోని మణికంఠ కాలనీకు చెందిన కృష్ణమూర్తి కుమార్తె హర్షిత (24) ఆత్మహత్య చేసుకుంది. కర్ణాటకలోని బాగేపల్లి సమీపంలోని దిబ్బూరపల్లి గ్రామానికి నివాసి నాగేంద్రతో గత సోమవారం ఉదయం ఆమెకు వివాహమైంది. ఆ రాత్రికే బంధుమిత్రులతో కలిసి సోమందేపల్లికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి హర్షిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా, ఇష్టం లేని పెళ్లి చేయడంతోనే నవ వధువు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. ఉరికి వేలాడుతున్న భార్యను చూసి వరుడు నాగేంద్ర దిగ్భ్రాంతికి లోనయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మృతురాలి మెట్టినిల్లు కర్ణాటక ఆధారంగా విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి దుర్మరణం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాడిపత్రి టౌన్: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తాడిపత్రి మండలం రావి వెంకటాంపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళుతున్న యువకుడ్ని (34) ని వాహనం ఢీకొంది. ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని తాడిపత్రి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా, మృతుడు వలస కూలీ అయి ఉంటాడని అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్ మృతి


మృతి చెందిన ట్రాన్స్‌జెండర్

కనగానపల్లి: మండలంలోని పర్వతదేవర సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ప్రమాదంలో గుర్తు తెలియని 50 సంవత్సరాల హిజ్రా (ట్రాన్స్‌జెండర్) మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న గూడ్స్ కంటైనర్ ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న ట్రాన్స్‌జెండర్‌తో పాటు డ్రైవర్ కన్నల్ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన ట్రాన్స్‌జెండర్ అక్కడికక్కడే మృతి చెందింది. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత రోజుల్లో అదే స్థాయిలో సైబర్ నేరాలూ పెచ్చుమీరాయి. పోలీసులు ఇందుకు అడ్డుకట్ట వేస్తున్నా.. వారి ఆగడాలు మాత్రం తగ్గడం లేదు. రోజుకో కొత్తదారులను వెతుక్కుంటూ.. ఆధార్ వేలిముద్రలను కూడా విడిచిపెట్టడం లేదు. గోప్యంగా ఉన్న ఆధార్ సమాచారాన్ని అసలు ఎలా తస్కరిస్తున్నారని మిలియన్ డాలర్ల ప్రశ్నగానే మిగిలిపోతోంది. జిల్లాలో ఈ తరహా నేరాలతో చాలా మంది నష్టపోతున్నారు. రోజూ ఏదో ఒక ప్రాంతంలో సైబర్ నేరాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి.

- ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్‌తో సైబర్ వల
- గుట్టుచప్పుడు కాకుండా బ్యాంకు ఖాతాల్లోని నగదు బదలాయింపు

వేలిముద్రలు భద్రమేనా?

ధర్మవరం అర్బన్: వేలి ముద్రల ఆధారంగా బ్యాంక్ ఖాతాల నుంచి నగదు అపహరించే సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ ఎక్కువవుతున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ప్రజల బ్యాంక్ ఖాతాల్లోని నగదును అపహరిస్తున్నారు. ఈ దోపిడీకి ఎలాంటి ఓటీపీ మెసేజ్‌లు, అనుమతులు అవసరం లేకపోవడం గమనార్హం. కేవలం ఆధార్ నంబర్ల ఆధారంగా వాటికి లింక్ అయిన బ్యాంకు ఖాతాల్లోని నగదును మాయం చేస్తున్నారు. ఇందుకు ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్(ఏఈపీఎస్)ను ఉపయోగిస్తున్నారు.

ఓటీపీ రాదు...

ఖాతాదారుడి బ్యాంకు ఖాతా నుంచి నగదు లావాదేవీలు జరిపేటప్పుడు ఖాతాదారుడి మొబైల్‌కు ఓటీపీ రావడం సహజం. ఈ ఓటీపీ నంబర్ ఎంటర్ చేస్తే నగదు బదలాయింపు జరుగుతుంది. అయితే ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) ద్వారా ఎలాంటి ఓటీపీలూ రావు. దీంతో ఖాతాదారుడికి తెలియకుండానే నేరగాళ్లు బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో...

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న సైబర్ నేరగాళ్లు చాలా తెలివిగా ఖాతాదారుల వేలిముద్రలను సేకరిస్తారు. ఆధార్ ద్వారా బ్యాంకు ఖాతాలో డబ్బులు డ్రా చేయాలంటే రోజుకు రూ.10వేల నుంచి రూ.15వేలు మాత్రమే సాధ్యమవుతుంది. ఇది సైబర్ మోసగాళ్లకు కలిసి వచ్చింది. అర్ధరాత్రి 12 గంటలకు ముందు ఒకసారి, 12గంటలు దాటిన తర్వాత మరోసారి బ్యాంకు ఖాతాలో డబ్బు కాజేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో మూడు సార్లు మాత్రమే ఆధార్ వేలి ముద్రల ద్వారా డబ్బు డ్రా చేసుకునే వెసులుబాటును సైబర్ నేరగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు.

రిజిస్ట్రేషన్ శాఖల్లోని లావాదేవీలపై కన్ను



ఏఈపీఎస్ ద్వారా నగదు అపహరించేందుకు వేలిముద్రలు కీలకం కావడంతో సైబర్ నేరగాళ్లు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్లలోకి అక్రమంగా చొరబడుతున్నారు. భూ దస్త్రాల్లోని వేలిముద్రల పత్రాల్ని డౌన్‌లోడ్ చేసుకుని వాటి ద్వారా నకిలీ వేలిముద్రలను సృష్టిస్తున్నారు. సాధారణంగా యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యే అవకాశముంది. కానీ కొన్ని శాఖల్లో గెస్ట్‌గా లాగిన్ అయ్యే అవకాశాన్ని సైబర్ నేరగాళ్లు అనువుగా చేసుకుని పత్రాల్ని కాజేస్తున్నారు. ఈ భూదస్త్రాల్లోని వేలిముద్రల ప్రింట్లను సేకరించేందుకు నేరస్తులు బటర్ పేపర్‌ను వినియోగిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. బటర్ పేపర్‌పైకి తీసుకున్న వేలిముద్రలు గాజు గ్లాస్‌పై ముద్రించి రబ్బర్ పోయడం ద్వారా పాలిమర్ ప్రింట్‌ను తయారు చేస్తారు. ఇదే నకిలీ వేలిముద్ర మాదిరి. బయోమెట్రిక్ యంత్రంలో ఈ నకిలీ వేలిముద్ర పెట్టి సంబంధిత వ్యక్తి బ్యాంకు ఖాతాలోని నగదు కాజేస్తున్నారు.

లాక్ సిస్టమ్‌తో చెక్



ఆధార్ వేలిముద్రల ద్వారా ఖాతాదారుడి బ్యాంకు ఖాతాల్లో నగదు అపహరించే ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. ప్రజలు కూడా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. గుగుల్‌ప్లే స్టోర్‌లో వెళ్లి ఎంఆధార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్ నంబర్‌ను లాక్ చేసుకుంటే సైబర్ నేరాలకు ఆస్కారం ఉండదు. ఖాతాలోని నగదు మాయం కాగానే వెంటనే బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేయాలి. అలాగే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. ఒకవేళ బాధితుడి ప్రమేయం లేకుండా డబ్బు పోయిన చాలా ఉదంతాల్లో ఫిర్యాదు చేసిన 45 రోజుల్లోపు తిరిగి జమ అయింది.

– రెడ్డప్ప, టూ టౌన్ సీఐ, ధర్మవరం

సెంట్రల్ యూనివర్సిటీలో 'మిషన్ మాలవ్య' కేంద్రం

అనంతపురం: అనంతపురం శివారులోని జంతలూరు వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మిషన్ మాలవ్య ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం (ఎంఎంటీటీసీ) ఏర్పాటుకు అనుమతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థల అధ్యాపకులకు ఆధునిక, నాణ్యమైన శిక్షణ అందించి వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుంది. వినూత్న బోధనా పద్ధతులు, బోధనలో సాంకేతికత వినియోగం, పాఠ్యాంశాల రూపకల్పన, పరిశోధన, మూల్యాంకన పద్ధతులు, బహుళ శాస్త్రీయ బోధన విధానాలు ఈ కేంద్రం ప్రధానలక్ష్యాలని వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్ఏ కోరి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీలా రెడ్డి తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటు వర్సిటీకి, విద్యారంగానికి గర్వకారణమని పేర్కొన్నారు.


సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ పాలక భవనం

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి


మృతుడు తిమ్మన్న

గుడిబండ: విద్యుత్ షాక్‌తో రెండు మేకలతో పాటు గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన హిరేతుర్పి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు.. హిరేతుర్పి గ్రామానికి చెందిన తిమ్మన్న (70) జీవాల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం గ్రామ సమీపంలో పంట పొలాల్లో మేకలను మేపడానికి మహేష్ అనే రైతు మల్బరీ షెడ్ వద్దకు వెళ్ళాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ఘటనలో మేకలు కూడా మృతి చెందాయి. తిమ్మన్నకు భార్య సాకమ్మ, ఓ కుమారుడు ఉన్నారు.

వేలాంకణికి ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: తమిళనాడులోని నాగపట్నంలో వెలసిన వెలాంకణి ఆరోగ్యమాత ఉత్సవాలను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బాంద్రా టెర్మినల్ – వెలాంకణి ప్రత్యేక రైలు (09093) ఈ నెల 27, సెప్టెంబరు 6వ తేదీల్లో రాత్రి 9–40 గంటలకు బాంద్రా టెర్మినల్ బయలుదేరి రెండో రోజు ఉదయం 7–40 గంటలకు వెలాంకణికి చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో రైలు (09094) వెలాంకణిలో ఈ నెల 30, సెప్టెంబరు 9 తేదీల్లో అర్ధరాత్రి 12–30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం పదిన్నరకు బాంద్రా టెర్మినల్‌కు చేరుకుంటుందన్నారు. రాయలసీమ జిల్లాలోని మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంటల మీదుగా ప్రయాణిస్తుందన్నారు.

14, 15 తేదీల్లో బీదర్ స్పెషల్ రైళ్లు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 14, 15వ తేదీల్లో బెంగళూరు–బీదర్– బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. 14వ తేదీ బెంగళూరు జంక్షన్ (06519) నుంచి రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు బీదర్ జంక్షన్‌కు చేరుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్ నుంచి బయలుదేరిన రైలు (06520) మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు బెంగళూరుకు చేరుతుంది. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూర్, కృష్ణ, యద్గాది, షాహాబాద్, కలబురిగి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

కోయంబత్తూర్–జైపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

కోయంబత్తూర్–జైపూర్–కోయంబత్తూర్ మధ్య ఈ నెల 7 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకూ ప్రతి గురు, ఆదివారాల్లో దాదాపు 10 సర్వీసులను నడపనున్నారు. కోయంబత్తూర్ జంక్షన్ నుంచి ఈనెల 7న రాత్రి 2.30 గంటలకు బయలుదేరిన రైలు (06181) మరుసటి రోజు మధ్యాహ్నం 1.35 గంటలకు జైపూర్ జంక్షన్‌కు చేరుతుంది. తిరిగి ఈ నెల 10న రాత్రి 10.05 గంటలకు జైపూర్ జంక్షన్ బయలుదేరిన రైలు (06182) మూడో రోజు ఉదయం 8.30 గంటలకు కోయంబత్తూర్ జంక్షన్‌కు చేరుతుంది. తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పెట్టై, కాట్పాడి, రేణిగుంట, కడప, యర్రగుంట్ల, గుత్తి, డోన్, కర్నూలు, గద్వాల్, మహబూబ్‌నగర్, కాచిగూడ, కామారెడ్డి, నిజామాబాద్ మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

నాటుసారా నిర్మూలనకు చర్యలు చేపట్టండి

- కలెక్టర్ టీఎస్ చేతన్


పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ చేతన్, అధికారులు

ప్రశాంతి నిలయం: జిల్లాలో నాటుసారా నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నవోదయం 2.0 కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నాటుసారా ప్రభావిత 7 గ్రామాలు, ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలోని 19 మండలాల్లో 53 గ్రామాలను విముక్త లభించడం అభినందనీయమన్నారు. ఈ సంఖ్యలో మొత్తం 53 గ్రామాల్లో నాటుసారా నిర్మూలన జరిగినట్లుయిందని అన్నారు. త్వరలో జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నవోదయం 2.0 పోస్టర్లను విడుదల చేశారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ డీసీ నాగముద్దయ్య, ఏసీ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్, ఏఎస్పీ ఆదినారాయణ, డీపీఓ సమత, డీఈఓ క్రిష్ణప్ప, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, వంకల ఆక్రమణలపై నివేదికలు సిద్ధం చేయండి : జేసీ

జిల్లాలో చెరువులు, వంకలు, ప్రాజెక్టులు, వాగుల పరిధిలో ఆన్యాక్రాంతమైన భూములను గుర్తించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాటర్ బాడీస్ వాచ్‌డాగ్ అంశంపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. వాగులు, వంకలు, చెరువుల స్థలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు, పెనుకొండ, ధర్మవరం డివిజన్ ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

లే అవుట్ల క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ (పుడా) పరిధిలో వేసిన అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఈ నెల 26వ తేదీ వరకు గడువు పెంచినట్లు పుడా వైస్ చైర్మన్ అభిషేక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివరాలకు 90006 83035లో సంప్రదించాలని సూచించారు.

కారు బోల్తా – ఇద్దరికి గాయాలు

తనకల్లు: మండలంలోని బీటీ క్రాస్ సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపు తప్పడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. తలుపులకు చెందిన రాఘవ, బ్యాల్డ్ మంగళవారం అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు కారులో బయలుదేరారు. బీటీ క్రాస్ సమీపం వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. కారులో ఉన్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను చికిత్స కోసం తొలుత తనకల్లు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఏడు గ్యాస్ సిలిండర్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సిలిండర్లను చూపుతున్న విజిలెన్స్ అధికారులు

ధర్మవరం: గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తుండడంతో ఏడు సిలిండర్లను విజిలెన్స్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు విజిలెన్స్ ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. ధర్మవరంలోని రంగా థియేటర్ సమీపంలో ఉన్న చెన్నాదేవి ప్రభ షాపులో మంగళవారం డొమెస్టిక్ కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా నిల్వ ఉంచి చట్ట విరుద్ధంగా వ్యాపారం చేయడాన్ని గుర్తించారు. 7 ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. యజమాని చెన్నదేవి ప్రభపై కేసు నమోదు చేశారు.

సరుకులే కాదు.. కార్లు, ఫ్రిజ్‌లు, కూలర్లూ..

- మాజీ సైనికోద్యోగులకు అనేక సౌలభ్యాలు
- అవగాహన లేక వినియోగించుకోని వైనం
- ఆన్‌లైన్‌లోనే అన్ని కార్యకలాపాలు


అనంతపురంలోని మిలటరీ క్యాంటీన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మిలిటరీ క్యాంటీన్ అంటే చాలామంది కేవలం నిత్యావసర సరుకులు, లిక్కర్ లభించే ప్రదేశమే అనుకుంటారు. అయితే, క్యాంటీన్ ద్వారా ఎన్నో సౌలభ్యాలు అందుబాటులో ఉన్నాయి. వాటి గురించి తెలియక చాలామంది మాజీ సైనికోద్యోగులు వినియోగించుకోవడం లేదు. శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లా వ్యాప్తంగా 2,200 మందికి పైగా మాజీ సైనికోద్యోగులు ఉన్నారు. వీరిలో చాలామంది తక్కువ ధరకు లభించే ఖరీదైన వస్తువులను వినియోగించుకోలేక పోతున్నారు. సమాచార లోపం కారణంగా భారీగా రాయితీలు కోల్పోతున్నారు.

కార్లు, టూవీలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు కూడా

మాజీ సైనికోద్యోగులకు నెలకు ఐదువేల రూపాయలకు వచ్చే సరుకులనే చూస్తున్నారు కానీ మిగతావి చూడటం లేదు. వాస్తవానికి క్యాంటీన్‌లో అవసరం లేకుండా కార్లు, ఫ్రిజ్‌లు, డ్రైవ్ గ్రహోపకరణాలు, ఏసీ, ఎల్ఈడీ టీవీలు ఇవన్నీ తీసుకోవచ్చు. ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం కూడా లేదు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని నేరుగా ఇంటికే కారు తెచ్చించుకునే అవకాశం ఉంది. ఇందుకోసం మాజీ సైనికోద్యోగి ముందుగా ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలి. afd.csdindia.comలో ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవితకాలం ఉంటుంది. కొత్త కార్డు కోసం csdsmartcard.com వెబ్‌సైట్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. కారు లేదా టూవీలర్ కావాలంటే పోర్టల్‌కు వెళ్లి అవైలబిలిటీ సర్టిఫికెట్ తెచ్చి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే అనుమతి వస్తుంది. రూ

ఏవి ఎన్ని తీసుకోవచ్చు

కేటగిరీ	పరిమితి
నిత్యావసరాలు	రూ.5,000
లిక్కర్	4 బాటిళ్లు కనిష్టంగా
కారు	రూ.12 లక్షలు విలువైన (ర్యాంకునుబట్టి)
టూవీలర్	ఎంత సీసీ ఉన్నదైనా
టీవీ, ఏసీ	రేటు పరిమితి లేదు

చెరువు కాలువకు అడ్డంగా మట్టి


కాలువకు అడ్డంగా వేసిన మట్టికట్ట

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి నుంచి కోడూరు వరకు ఏర్పాటవుతున్న 342ఎ జాతీయ రహదారి నిర్మాణ పనులతో ఓ చెరువుకు వర్షపు నీరు చేరకుండా మట్టి కట్ట అడ్డుగా వేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. పుట్టపర్తి మండలం బత్తలపల్లి గ్రామ చెరువుకు గోరంట్ల మండలం నుంచి కాలువ ద్వారా వర్షపు నీరు చేరుతుంది. ఈ చెరువు కింద సుమారు 90 ఎకరాల ఆయకట్టు ఉంది. రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కాలువకు నీళ్లు చేరాయి. ఈ క్రమంలో కాలువపై బత్తలపల్లి వద్ద నిర్మిస్తున్న జాతీయ రహదారికి అనుసంధానంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఏదాది క్రితం పూర్తి చేశారు. ఇటీవల మరమ్మతుల కోసమని కాలువకు అడ్డంగా మట్టి కట్ట వేయడంతో నీళ్లు అక్కడే నిలిచి పక్కనున్న పొలాల్లోకి ప్రవహిస్తున్నాయి. కాలువ కట్ట ఎక్కడైనా తెగితే ఇబ్బంది పడక తామని రైతులు వాపోతున్నారు. వర్షాకాలం పూర్తయితే నీళ్లు రావని దీంతో ఏడాది పంటను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా బ్రిడ్జి పనులు పూర్తి చేసి మట్టి కట్టను పూర్తిగా తొలగించాలని రైతులు కోరుతున్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కొత్తచెరువు: స్థానిక పంచాయతీ పరిధిలో ఓ బాల్య వివాహాన్ని మంగళవారం అధికారులు అడ్డుకున్నారు. ఇరువైపులా కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

వేతనాలు ఇవ్వకపోతే సమ్మెలోకి

- శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులు


ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ధర్మవరం: శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదని ఆ పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం కార్యాలయ ఏఓ ఖతీజాన్‌కుప్రాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికుల నాయకులు, చింతకాయల సరేష్, సురేష్‌బాబు మాట్లాడారు. శ్రీసత్యసాయి తాగునీటి పథకం ద్వారా వెయ్యి గ్రామాలకు, 10 లక్షల మంది ప్రజలకు 540 మంది కార్మికులు తాగునీటిని అందిస్తున్నారన్నారు. నాలుగునెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. వేతనాలు ఇవ్వకపోతే ఈ నెల 11 నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు ప్రకటించారు.

సాయి మార్గం.. సకల జనులకు క్షేమం


నాటికలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: సాయి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన హర్యానా, చండీఘడ్ సత్యసాయి భక్తులు మంగళవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పంచముఖి హనుమాన్ 'పేరుతో నాటిక ప్రదర్శించి ఆకట్టుకున్నారు. సాయి మార్గం సకల జనులకు క్షేమం అంటూ సందేశాన్నిచ్చారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఎన్నో ఏళ్లు దేశ సేవ చేసి వచ్చిన మాజీ సైనికోద్యోగులు వారికి వచ్చే రాయితీలు తెలియక ఉపయోగించుకోవడం లేదు. ఖరీదైన వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకున్నా రాయితీ వర్తిస్తుంది. వీటిపై వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి మాజీ సైనికోద్యోగి గరిష్టంగా వీటి ప్రయోజనాలను పొందాలి.

– సీఎస్‌డీ మారుతి, మేనేజర్, అనంతపురం సీఎస్‌డీ క్యాంటీన్

రదు 20 శాతం తక్కువ ధరకు వాహనాలు అందుతాయి. కొన్ని టూవీలర్ల ధరలు 25 శాతం కూడా తగ్గుతాయి.

- ఒకసారి కారు లేదా టూవీలర్ తీసుకుంటే మళ్లీ ఐదేళ్ల వరకూ తీసుకోకూడదు. రెండేళ్ల పాటు బండిని అమ్ముకోకూడదు. తనపేరు మీదే ఉంటుంది. మిగతా ఏ ఖరీదైన వస్తువైనా సరే మూడేళ్లకోసారి తీసుకోవచ్చు. మిక్సీలు, గ్రైండర్లు ఇలా రూ.70 వేల లోపు విలువైనవి ప్రతి నెలా కొనుగోలు చేసుకోవచ్చు. ఈ రాయితీలు త్రివిధ దళాలు అంటే నేవీ, ఎయిర్‌ఫోర్స్, మిలిటరీ వారికి మాత్రమే వర్తిస్తాయి. బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ వంటివన్నీ పారామిలిటరీ కిందకు వస్తాయి. వీరికి వేరే క్యాంటీన్లు ఉంటాయి.